

# మలుపు

— శివల జగన్నాథరావు

పందిట్లో కుర్చీలమీదా, కిందపరిసిన జంఖానాలమీద మగపెళ్ళివారు శరీరాలు చేరవేసి, భుక్తాయాసం తీర్చుకొంటున్నారు. ముసలాళ్ళు నిద్రకుపక్రమిస్తూంటే, పడుచు కుర్రాళ్ళు పేకముక్కలు తీసి కలుపుతున్నారు. ట్రేలో కిళ్ళీలు పెట్టుకొచ్చి, ఒక్కొక్కరికీ ఇస్తున్నాడు శ్రీధర్.

"ఏమోయ్! మరిహ నీ విందెప్పుడు?" అడిగాడు మామగారి తమ్ముడుట, ఆయన నెరిసిన చెంప గోక్కుంటూ.

"అలా అడిగాడంటే ఇతనికో పెళ్ళికూతురుందన్నమాట!!" అనుకున్నాడు శ్రీధర్. నవ్వేసి వూరు

కున్నాడు. నోరువిప్పితే ఆయన మాటకి మాట గొలుసులు అతికి, అది మెళ్ళో తగిలించేస్తాడని!

"చెప్పేవు కాదు...." అన్నాడాయన చెంప గోక్కుంటూనే.

"చెబుతాను చెబుతాను" అంటూ మగపెళ్ళి వారందరికీ కిళ్లీలు ఇచ్చేశాడు. అట్లకాడలావున్న ఒక మ్మాయినిపట్టుకుని, పొత్రాల్లావున్న నలుగురు అమ్మలక్కలు భానుమతి పాటలు పాడమంటూ నసపెడు తున్నారు.

"మిట్ట మధ్యాహ్నంవేళ పాటేవిటింద్రా!" ఓ ముసలాయన ఆవులిస్తూ అభ్యంతరం పలికాడు.

"కాకపోతే అర్ధరాత్రి పాడతారేవిటి? మీ రూరుకోండి...." అని ఆయన భార్య గభిల్న ఆయనమాట ఖండించి పారేసింది!

నవ్వుకొంటూ వెళ్తూన్న శ్రీధర్ గభాల్న తనని గుద్దేసిన కుర్రాణ్ని-పడబోయి, పట్టుకున్నాడు. పదేళ్లు వుంటాయ్ వాడికి. కంగారుగా విడిపించుకుని వెళ్ళిపోబోతూంటే శ్రీధర్ అనుమానంగా పట్టుకుని "ఎవరు నువ్వు?" అని అడిగాడు.

మగపెళ్లి వారందరినీ చూశాడు తను. వాళ్ళపిల్లల్లో ఈ అబ్బాయి లేడు! మరి.... ఇందాక భోజనాలయినాక కొన్ని స్పూన్‌లు పోయాయనివిన్నాడు. ఇలాంటిచోట దొంగతనాలు జరగడం అతి మామూలు.

"చెప్పు! ఎవరు నీవు?" తిరిగి సీరియస్‌గా అడిగాడు చెయ్యి బిగించి.

మగపెళ్లివారు విశ్రాంతి తీసుకుంటున్నచోట వాడితో గొడవ పడడం ఇష్టంలేక, వాడి చెయ్యి పట్టుకుని ఓ వారకి లాక్కుపోయి, వాడి జేబుల్లో చెయ్యిపెట్టి వెదికాడు.

ఆ కుర్రాడు బిక్కమొహం పెట్టి "నేను.... నేను దొంగని కానండీ! ఆయన కోసం .... వచ్చేను...." అన్నాడు. శ్రీధర్ చేతికో కాగితం మడత తగిల్తే బైటికి తీశాడు.

"ఆయనా? ఎవరాయన! ఇదేమిటీ కాగితం?"

"అదే.... పొడుగ్గా, తెల్లగా, పెద్ద చెంపలూ...."

శ్రీధర్ కనుబొమ్మలు ముడిచాడు. ఈ పోలికల్తో ఇక్కడున్నది పెళ్ళికొడుకు....తనకి కాబోతున్న బావగారు!

"కళ్ళద్దాలు కూడా వుంటాయి. ఆయనేగా?"

"ఆc.... ఆయనే" వాడు బుర్ర వూపాడు.

శ్రీధర్ తన చేతిలోని కాగితం మడతలు విప్పి చూశాడు....వొళ్లు చల్లబడి పోయినట్టయింది ఒక్కమారుగా.

"ఇది కళ్లద్దాలాయనకి ఇవ్వ డానికి వెళ్తున్నావా?"

"వూఁ...."

"ఎవరు ఇవ్వమన్నారు నీతో?"

"చె....చెబితే....చంపేస్తానన్నా రండీ!"

"చెప్పకపోతే నేను చంపే స్తాను!"-వాడితో వీధిలోకి వెళ్లాడు.

కిళ్ళీ బడ్డీ దగ్గర ఓ యువకుడు నిల్చుని వున్నాడు. నల్లకళ్లద్దాలు, కిందికి దువ్విన క్రాఫింగ్, ఛామన ఛాయ, వైట్ డ్రెస్. నోట్లో సిగరెట్ వెలుగుతుంది.

శ్రీధర్ ఆగ్రహాన్ని బలవం తంగా మింగాడు.

"మిస్టర్!"

అత నిటు తిరిగి, శ్రీధర్‌తో వున్న కుర్రాణ్ణి చూసి తుళ్లిపడ్డాడు. వెళ్లిపోబోతూంటే శ్రీధర్ ఎదురు నిలబడి-

"వెళ్లిపోకండి! భయపెట్టే పని మీ కంటే మేమేం చేయగలం?" అన్నాడు వెటకారంగా.

అత నేమనుకున్నాడో! ఆగి పోయి సిగరెట్ పారేశాడు.

"చూడండి సార్! ఈ ఉత్తరం....మా బావగారి పోలి కలు చెప్పి ఆయనకి అందజేయించ డంలో మీ వుద్దేశ్యం?"

శ్రీధర్‌లో ఆవేశం కట్టలు తెంచుకుంటోంది. దిగమింగుకున్నా డెలాగో.

"ఈ పెళ్లి చెడగొట్టాలని కదూ?....అంటే మా బావగారికి... మా చెల్లాయి మీద అనుమానం కలిగించి....మా చెల్లాయి భవిష్య త్తుని బ్రద్దలు చెయ్యాలని కదూ? ఎంత పగ మీకు మా చెల్లాయ్ మీద!!"

"అవును పగే! పగ ఎందుకు కలగదూ?" అతని ముఖం ఎర్ర బడ్డది.

శ్రీధర్ విసుగ్గా చూశా డతన్ని.

"ఆ వుత్తరం చదివారుగా! ఇంకా తెలీలేదా, మీ చెల్లాయి నన్నెంత?...."

"స్టాపిట్!!" అంటూ శ్రీధర్ ఆ కాగితం మరో మారు చదివాడు.

"కుమార్! మై డియర్!

ఈమధ్య....మా ఇంట్లో నన్ను విపరీతంగా అనుమానిస్తున్నారు! మనిద్దరం మా మామయ్యకి, నాన్నకి సినిమాలో, బీచిలో కని పించేమట! ఎక్కడికీ వెళ్లకుండా కట్టుదిట్టాలు చేస్తున్నారు. అయినా, ఇవ్వా ళెలాగో, మా ఫ్రెండ్ రాజేశ్వరి ఇంటికి వెళ్లివస్తానని చెప్పి, ఒప్పించి బయల్దేర్తాను. సాయంత్రం నాలుగు గంటలకు తప్పకుండా రా—రోహిణి.

శ్రీధర్ మొహంపై పేడ కళ్లాపు చల్లినట్టయింది.

"ఇలాటి లెటర్స్ ఎన్ని వున్నాయి మీ దగ్గర?"

కుమార్ అదోలా నవ్వాడు. "ఇచ్చెయ్యాలా, అవన్నీ?"

శ్రీధర్ అతని రెండు చేతులూ పట్టుకున్నాడు.

"జరిగిందేదో జరిగిపోయింది. పందిట్లో దాని పెళ్ళి చెడగొట్టకండి! నా చెల్లాయి అని దాన్ని వెనకేసుకు రావటం లేదు! అది చేసిన పనికి సిగ్గు పడుతున్నాను. కాని....కాని.... దాని వివాహం అభాసుపాలయి, దాని జీవితం బ్రద్దలయితే మా అమ్మా నాన్నా గుండె పగిలి చచ్చిపోతారు."

కుమార్ శ్రీధర్ చేతుల్నించి తన చేతుల్ని విడిపించుకున్నాడు.

"జరిగిందేదో జరిగిపోయిందని మీరింత సులువుగా అనేస్తున్నారు. కాని, నే నెలా అనుకోగలను? నా పరిస్థితిలో మీరు వుంటే తెలిసేది మీకు...."

శ్రీధర్ మనస్సు వులిక్కిపడింది. పెదవులు బిగబట్టి, బాధగా గుటక మింగాడు.

"రోహిణి నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించిందని భావించాను. యివ్వాళ పెళ్ళిపీటలమీద మరొకరి ప్రక్కన నిర్భయంగా కూర్చుంది! ఛ ఛ! ఈ ఆడవాళ్ళని చస్తే నమ్మకూడదు!"

శ్రీధర్ మాట్లాడలేకపోయాడు. తిరిగి అమాంతం కుమార్ రెండు చేతులూ పట్టుకున్నాడు దీనంగా.

కుమార్ ఇక మాట్లాడలేదు. తన వెంట శ్రీధర్‌ని రమ్మని, యింటికి వెళ్ళి రోహిణి తనకి రాసిన వుత్తరాలు తెచ్చియిచ్చాడు. శ్రీధర్ సంతోషంతో, కృతజ్ఞతా పూర్వకంగా కుమార్ చేతులు నొక్కి వదిలాడు. బహుశా రోహిణి తిరగటం చూసే, తన తండ్రి వెంటనే యీ సంబంధం చూసివుండాలి. అయినా రోహిణి యీ వివాహానికి ఎందుకు ఒప్పుకున్నట్టు? అతడు తిరిగి పెళ్ళి పందిట్లోకి వస్తూవుంటే "చెప్పావ్ కాదు!...." అన్నాడు నెరిసిన చెంపలాయన. 'నామొహం, చెప్పినట్టే వుంది....' అనుకున్నాడు శ్రీధర్. పాడి, పాడి అలిసిపోయిన ఆ అట్లకాడలాంటమ్మాయి.... "ప్రతివారు లో పేరు చెబుతారులే....పై మోజుకే లొంగి పోతారులే" అంటూ భానుమతి పాట ఏకాగ్రంగా పాడేస్తూంది!!

శ్రీధర్ గబగబా తన గదిలోకి వచ్చి తలుపులు గెడ పెట్టేశాడు.

జేబులోంచి వుత్తరాలు తీసి అలా వుంచాడు. తన పెట్టె తెరిచి, బట్టల అడుగున, న్యూస్ పేపరు క్రిందనించి కాయితం చుట్టిన చిన్న దొంతర తీశాడు.

అవి....నళిని తనకు రాసిన లేఖలు! ప్రేమలేఖలు!

నళిని!

అవతలి వీధిలో డాక్టర్‌గారమ్మాయి.

తనతో కాలేజీలో మూడేళ్లు చదివింది. క్లాస్ మేట్!

తనపట్ల ఆమెకెంత ఆరాధన వుండేదో వివరించడానికి ఇందులో ఒక్క వుత్తరం చాలు!

"నా శ్రీధర్!....

నన్ను క్షమిస్తావు కదూ! నీతో చెప్పకుండా నేను ఈ నాలుగు రోజులు మా వాళ్ళతో కలిసి వూరికి వెళ్ళినందుకు....వెళ్ళానే గాని....నా మనసంతా నీ దగ్గరే వుంది శ్రీధర్! నిన్ను కలవాలనే ఆత్రంలో నాకు నిముషమొక యుగంలా వుంది. సాయంత్రం లోపల నీవు ఆఫీసు విడిచి రాలేవు గనుక యీ వుత్తరం వ్రాస్తున్నాను. సాయంత్రం మన ఎప్పటి చోట....నీ స్వీట్....నళిని...."

తన కోసం తహతహలాడిన నళిని, పదిరోజుల్లో మరొకరి చేత మాంగల్యధారణ కావించుకోబోతున్నది! నాలుగు రోజులు తనని వదిలి వుండలేని తను....జీవితాంతం వదిలెయ్యటానికి సిద్ధమౌతోంది.

ఎంత చిత్రమైన వాళ్ళు ఆడవాళ్ళు!

ఆ కాబోయే భర్త తనకంటే పెద్ద ఉద్యోగం చేస్తున్నాడట! విదేశాలకు వెళ్ళివచ్చాట్ట! పెళ్ళయ్యాక, భార్యతో మళ్లా ఫారిన్ వెళతాట్ట! వేల రూపాయల సంపాదన! పెద్ద హోదా! విదేశ పర్యటన!

అతని కంటే తను తక్కువ అనేగా తనని వదిలేసింది! వాళ్లమండి ఆ మాటే అడిగితే—

"అంతమాటనకు శ్రీధర్! ఈ పెళ్లి మావాళ్ల బలవంతంమీద జరుగుతూంది.... నేను కాదంటే మా అమ్మా, నాన్న బలవంతాన చచ్చిపోతామంటున్నారు.... ఏం చేయను, చెప్పు!" అంది!

"వాళ్లలాగే నేనూ అంటే?"

"శ్రీధర్!" ఏడ్చింది!

తన మనసులో మంట చల్లారలేదు. నళినిమీద పగతీర్చుకోవాలనిపించింది. తనకి రాసిన వుత్తరాలు తన పెట్లో భద్రంగా దాచాడు. నళిని పెళ్లిలో అవి బహిరంగ పరచాలి!

(తరువాయి 79 వ పేజీలో)

దగ్గరగా వెళ్ళాను థాంక్స్ చెప్పడానికి. తన కళ్ళల్లోకి సూటిగా చూద్దా మనుకున్నప్పుడే తనూ నన్ను సూటిగా చూసింది. సన్నగా నవ్వి "థాంక్స్" అంది. నేనుతలఎత్తేసరికి సత్యవతి వెళ్తోంది నాన్న పెళ్ళికి అమ్మమ్మ చేయించిన నా వుంగరాన్ని వదలి వెళ్ళలేక... ఆ మార్వాడీ కొట్టుని గుర్తుపెట్టుకుందామని కొట్టు వేపు చూశాను. నావుంగరాన్ని, సత్యవతి రింగుల్ని ఓ పచ్చ దారంతో గట్టిగా బిగించే ప్రయత్నంలోవున్న ఆ మార్వాడీ కుర్రాడు కనిపించాడు.

నన్ను ఒకసారి దగ్గరకు రమ్మన్నట్టు సైగ జేసి, "మీ శ్రీమతిగారి మెళ్ళో పుస్తె కనిపించలేదు. బహుశా ఎక్కడో తాకట్టు పెట్టి వుంటారనుకుంటాను. మళ్ళీ ఏదైనా తాకట్టు పెట్ట దలచినప్పుడు నన్ను మర్చిపోకండి. ఇక్కడికే రండి" అన్నాడు వాడు. *

---

# మలుపు

(63 వ పేజీ తరువాయి)

నళిని పెళ్లి చెడగొట్టాలి. తన కసి తీరాలి!

....కాని, కాని....

శ్రీధర్ నిట్టూర్చాడు. ఓ ఆడపిల్ల అన్నగా తనెంత క్షోభ అనుభవించా డిందాక?! కుమార్ అన్నాడు— "నారిస్థితిలో మీరు ఉంటే....?"

"ఉన్నాను కుమార్! నీ పరిస్థితిలోనే వున్నాను నేను కూడా. నీలాగానే నేనుకూడా నళిని జీవితం భగ్నం చేయాలని భావించాను. నీవు నా చెల్లెలి జీవితాన్ని కాపాడావో, నా కళ్ళే తెరిపించావో నా కర్థం కావటంలేదు. నేను నీకు ఋణపడి వున్నాను కుమార్-ఋణపడి వున్నాను."

జేబులోంచి అగ్గిపెట్టెతీసి వెలిగించి ఆ రెండు ఉత్తరాల దొంతరల్నీ అంటించాడు. అవి మండి మసి అవుతున్న సమయంలో రోహిణి గదిలోకి వచ్చి, "ఏంటన్నయ్యా! ఇక్కడ చలికాగుతున్నావు?" అంది నవ్వుతూ.

ఆమెది పెళ్ళి ఉత్సాహం.

"మంటకి అవినీతి ఎక్కడిదా అని యోచిస్తున్నాను చెల్లీ. చూడు మంటల్లోంచి ఎంతటి నల్లటి పొగ బయటికి వస్తోందో?!" అన్నాడు శ్రీధర్. *